క్లుప్తంగా

ఘనంగా ధనలక్ష్మి అమ్మవారి జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కె.గంగవరం: మండలంలోని సత్యవాడలో కొలువైన ధనలక్ష్మీ అమ్మవారి జాతరని గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలో గరగ నృత్యాలు, బుట్టబొమ్మలు, కోయడాన్సులు, పలు వేషధారణలతో వాయిద్యాలతో జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతరతో పాటు ఆలయం వద్ద నిర్వహించిన తీర్థంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని వస్తువులను కొనుగోలు చేశారు. కమిటీ సభ్యులు ధనేశ్వరావు, సలాది ప్రకాష్, సలాది శ్రీరామ్‌కుమార్, సలాది రాంబాబు తదితరులు ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయవరం: మండలంలోని చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. 1988–89 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో బుధవారం కుటుంబ సభ్యులతో సహా కలవనున్నారు. మూడున్నర దశాబ్దాల అనంతరం అందరూ పాఠశాల ప్రాంగణంలో కలుసుకుని, తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించుకోనున్నారు.

నేడు నక్షత్ర వనారామం వార్షికోత్సవం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరులో బుధవారం సత్యలక్ష్మణ సప్తర్షి నవగ్రహ నక్షత్ర వనారామం 8వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి మంగళవారం తెలిపారు. మానవాళి ఆరోగ్య సంరక్షణ నిమిత్తం సనాతన ధర్మం మేరకు ఎనిమిదేళ్లుగా వివిధ మొక్కల పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటలకు రెడ్డి సురేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నట్టు చైర్మన్ తెలిపారు.

ఘనంగా రంగవల్లుల పోటీలు

కాజులూరు: సంక్రాంతి పండగ పురష్కరించుకుని కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో రంగవల్లుల పోటీలు ఘనంగా జరిగాయి. గొల్లపాలెం శివారు ధనలక్ష్మి కాలనీలో స్థానిక దళితయూత్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో గ్రామ ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి తదితరులు పాల్గొని విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పలు ఆటల పోటీలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరచుటలో యువసంఘాలు నిర్వహిస్తున్న పాత్ర అభినందనీయమన్నారు. మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి నిమ్మితి విజయ్, నాగార్జున, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



అయితపూడిలో పేదలకు దుస్తులు, పిండి వంటలు పంపిణీ చేస్తున్న కొల్లు వెంకన్న ఫౌండేషన్ సభ్యులు

కాజులూరు: సంక్రాంతి పండగ పురస్కరించుకుని అయితపూడిలో కొల్లు వెంకన్న ఫౌండేషన్ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛందంగా గ్రామంలో సుమారు 600 మంది పేదలకు దుస్తులు, పిండి వంటలు పంపిణీ చేశారు. కొల్లు వెంకన్న ఫౌండేషన్ చైర్మన్, స్థానిక మాజీ సర్పంచ్ కొల్లు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ తండ్రి దివంగత కొల్లు వెంకన్న పేరున స్థాపించిన ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా 27 సంవత్సరాలుగా ఏటా పేదలకు దుస్తుల పంపిణీ నిర్వహిస్తున్నామని, గ్రామంలోని అందరితో కలసి తమ కుటుంబ సభ్యులు సంక్రాంతి పండగ జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వరలక్ష్మి, శ్రుతి, రవితేజ, చైతన్యకృష్ణ, మణికుమారి, పాప, వేద, పంపన వెంకటేశ్వరరావు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కనుమ మహాలక్ష్మమ్మ జాతర

రావులపాలెం: సంక్రాంతి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఊబలంక కనకమహాలక్ష్మి అమ్మవారి పంట జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. కనుమ సందర్భంగా గ్రామ దేవతకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖశాంతులతో తులతూగాలని గ్రామ దేవతకు ప్రతి సంకాంత్రికీ కనుమ రోజు జాతర నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో అమ్మవారి గరగలను ఊరేగించారు. జాతరలో ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు, బ్యాండ్ మేళాలు, శక్తి నృత్యాలు, బొమ్మల వేషధారణలు, కోలబృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే రావులపాలెంలో సంక్రాంతి సందర్భంగా గ్రామ దేవత వాకులమ్మ అమ్మవారి గరగలను ఊరేగించారు. గ్రామస్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుని నైవేద్యాలు సమర్పించారు.

అంతటా సంక్రాంతి

- ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పరవశించిన పల్లెలు
- దేవతామూర్తులను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రాయవరం: సంక్రాంతికి పల్లె హృదయాలు పరవశంతో ఉప్పొంగాయి. ఇళ్ల లోగిళ్ల రంగవల్లులతో మురిశాయి. ముత్యాల ముగ్గులు..గొబ్బెమ్మల పూజలు..సంక్రాంతి శోభకు మరింత వన్నెలద్దాయి. సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. తెలుగువారి ముఖ్యమైన పండుగల్లో ప్రముఖమైన సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా సంప్రదాయ కోడి పందేలు భారీఎత్తున జరిగాయి. వాటిని తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఊరూవాడా హరిదాసుల సందడి, బొమ్మల కొలువులు ఆకట్టుకున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి, కనుమ వేడుకలు అలరించాయి. పెద్ద పండుగ, కనుమ పండుగలను సోమ, మంగళవారాల్లో మండల ప్రజలు ఆనందోత్సాహాలతో గడిపారు. ఏ ఇల్లు చూసినా కూతుర్లు, అల్లుళ్లు, బంధువులతో సందడి వాతావరణం సంతరించుకుంది. ప్రతీ ఇంటిలో పిండివంటల ఘుమఘుమలు చోటు చేసుకున్నాయి. ఇంటి ముంగిటకు వచ్చిన హరిదాసులు, గంగిరెద్దుల వారు, బుడబుక్కలవారు, పగటి వేషగాళ్ల ఇళ్ల వద్దకు వచ్చి శుభాశీస్సులు పలికారు. మరణించిన పితృదేవతలకు పూజలు చేసి వారి పేరిట పెద్దలకు దుస్తులు, భోజనాలు పెట్టారు. చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం దూరప్రాంతాల్లో ఉన్న వారు ఇళ్లకు చేరుకోవడంతో పల్లె, పట్నం అనే తేడా లేకుండా లోగిళ్లన్నీ కళకళలాడాయి. ప్రతీ ఇల్లు అక్కుళ్ళు, కూతుర్లు, బంధువులతో సందడి వాతావరణాన్ని సంతరించుకుంది. చిన్నారుల నుంచి వయస్సు మీద పడిన వారితో సహా అందరూ నూతన వస్త్రాలు ధరించి సంతోషంతో గడిపారు. కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఒకే చోట చేరడంతో ఏడాదిగా జరిగిన విశేషాలను పంచుకుని, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వీధులన్నీ రంగవల్లుల మయంగా మారాయి.

ఘనంగా వెంపర్తమ్మ తీర్థం

మండలంలోని పసలపూడిలో పాటి కాలువ వద్ద వేంచేసియున్న వెంపర్తమ్మ తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14న అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి, సోమవారం రాత్రి జాతర నిర్వహించారు. మంగళవారం అమ్మవారి తీర్థం జరిగింది. పసలపూడి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గరగలతో ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా ఆలయం వద్ద ఘనంగా అన్నసమారాధన చేపట్టారు.

సంక్రాంతి సందడిలో పల్లె సీమలు

కపిలేశ్వరపురం (మండపేట): సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం కపిలేశ్వరపురం మండలంలోని పల్లెల్లో సందడి నెలకొంది. ప్రజలు నూతన వస్త్రాలను ధరించి దేవతామూర్తుల ఆలయాలను సందర్శించారు. రంగురంగుల ముగ్గులను అద్దుతూ మగువలు సంప్రదాయ పద్ధతిలో సంక్రాంతిని వైభవంగా జరుపుకున్నారు. కపిలేశ్వరపురం మండలం అంగర, వెదురుమూడి, నల్లూరు, కాలేరు గ్రామాల్లోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి, అంగర, టేకి గ్రామాల్లోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామివార్ల ఆలయాల్లో గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

అమ్మవార్ల జాతరలతో సందడి..

అంగరలోని శ్రీరాజరాజేశ్వరి దేవి అమ్మవారికి కుంభాభిషేక పూజలు చేశారు. గ్రామస్తులు అమ్మవారికి కలశాలతో తరలించిన పుణ్య జలాలతో అభిషేకం చేశారు. మాచరలో గొల్లాలమ్మ, వీధివారిలంకలో ధనమ్మతల్లి, పడమర ఖండ్రికలో పోసమ్మ జాతర సందర్భంగా అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆడపడుచులు మొక్కులు తీర్చుకున్నారు.

పల్లెపల్లెనా సంక్రాంతి సందడి

కపిలేశ్వరపురం (మండపేట): సంక్రాంతి సందర్భంగా మండపేట మండలంలోని 12 గ్రామాల్లో సందడి నెలకొంది. దేవతామూర్తుల ఆలయాలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు, కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కురుపూడి భవాని, పార్టీ రూరల్ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు సందర్శించారు.

కల్యాణాలు... జాతరలు...

మండపేట పట్టణం బురుగుంట చెరువు వద్ద సీతారామ క్షేత్రంలో గోదాదేవీ, శ్రీరంగనాథుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా అమ్మవార్ల జాతరలతో మండలంలోని గ్రామాలు మార్మోగాయి. పట్టణంలోని పేరంటాల్లమ్మ తీర్థం వైభవంగా సాగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మెర్నిపాడులో ముత్యాలమ్మ జాతర, తీర్థ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అమ్మవారిని దర్శించుకోగా ఆయనకు సర్పంచ్ గారపాటి సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు, గారపాటి మురళి, ముత్యాల పెద్దబ్బు ఘన స్వాగతం పలికారు. ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం కన్నుల పండువగా సాగింది. గణపతి హోమం, ఇరుముడి అభిషేకాలు చేశారు. పలు గ్రామాల్లోని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు అబ్బిరెడ్డి వీర్రాజు, తుపాకుల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గని పోతురాజు తీర్థ మహోత్సవం

కేశవరం చెరువు గట్టుపై కొలువైన గనిపోతురాజు తీర్థ మహోత్సవంలో వేలాది భక్తులు తరలి వచ్చారు. స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వామిని దర్శించుకున్నారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వామివారికి పూజలు చేశారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ కూసు నరసింహమూర్తి, సభ్యులు పురంశెట్టి శ్రీను, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్ అధికారులు స్వాగతం పలికారు.



పసలపూడిలో వెంపర్తమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



పసలపూడిలో గ్రామ జాతర సందర్భంగా ఆకట్టుకున్న గరగ నృత్యాలు



ముత్యాలమ్మ జాతరలో దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు



కేశవరం గనిపోతురాజు ఆలయ దర్శనంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ముగిసిన సందడి

కాజులూరు: మండల గ్రామాల్లో వాడవాడలా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండగల్లో తొలిఘట్టమైన భోగి పండగను ప్రజలు ఆదివారం ప్రారంభించుకోగా సోమవారం సంక్రాంతి పండగను, మంగళవారం కనుమను వైభవంగా జరుపుకొన్నారు. గ్రామాల్లో పలువురు చిన్నారులు నెల రోజులుగా నిర్వహిస్తూ వస్తున్న గొబ్బిళ్ల పూజలకు భోగి పండగతో ముగింపు పలికారు. చిన్నారులు వాకిట్లో గొబ్బిళ్లు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చి ఆశీర్వచనాలు అందుకున్నారు. మకర సంక్రాతి పురస్కరించుకుని గ్రామస్తులు పితృదేవతలకు పూజలు నిర్వహించి వారి పేర్లతో వృద్ధులకు పండ్లు, ఫలహారాలు, దుస్తులు పంచారు. పండగ రోజుల్లో ప్రతి ఒక్కరూ తెల్లవారక ముందే తలారా స్నానం చేసి కొత్త దుస్తులు ధరించారు. కోడి పందాలు, గంగిరెద్దుల నృత్యాలు, పలు సంప్రదాయ ఆటల పాటలతో గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. పలువురు ఇళ్లల్లో పిల్లలకు డబ్బులు, రేగిపళ్లు, పువ్వులు, అక్షతలు కలిపి భోగిపళ్లు పోసే కార్యక్రమం వేడుకగా జరుపుకొన్నారు. కనుమ పండగ పురస్కరించుకుని పలువరు గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించారు. బంధుమిత్రుల రాకపోకలతో గ్రామాల్లో ప్రతి ఇల్లు కళకళలాడింది.

అట్టహాసంగా బాస్కెట్‌బాల్ పోటీలు



ద్వితీయ స్థానంలో నిలిచిన రామచంద్రపురం మహిళల జట్టు



క్రీడాకారులను సత్కరిస్తున్న చక్రవర్తి డాక్టర్ వెంకటరమణ తదితరులు

- ఫైర్ క్యాంప్‌లో క్రీడాకారులు ఆటా.. పాట
- ద్వితీయ స్థానంలో రామచంద్రపురం మహిళలు
- ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు సత్కారం

రామచంద్రపురం: ఆద్యంతం ఉత్కంఠ, క్రీడాకారుల ఫైర్ క్యాంపుతో ఉల్లాసంగా ఇలా సంక్రాంతిని పురస్కరించుకుని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో జరిగిన ఆలిండియా బాస్కెట్ బాల్ పోటీలు నాలుగు రోజుల పాటు అట్టహాసంగా సాగి రామచంద్రపురం పట్టణంతో పాటుగా పరిసర ప్రాంతాల క్రీడాభిమానులతో పాటుగా సంక్రాంతికి పల్లెలకు వచ్చిన వారికి సైతం ఆకట్టుకున్నాయి. ఈనెల12 నుంచి 15 వరకు ఆలిండియా 13వ మహిళల, పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలను రాష్ట్ర బాస్కెట్‌బాల్, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించారు. ఏపీ తెలంగాణతో పాటుగా ఛత్తీస్‌ఘడ్, పశ్చిమబెంగాల్ వివిధ రాష్ట్రాల నుంచి పురుషుల విభాగంలో 24, మహిళల విభాగంలో 12 జట్లు పాల్గొన్నాయి. ఓపెన్ కేటగిరిలో జరిగిన పోటీలను లీగ్ కం నాకవుట్ పద్ధతిలో జరగటంతో ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు ఉత్కంఠగా సాగాయి. సంక్రాంతి పండగను పురస్కరించుకుని గత 13 ఏళ్లుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో క్రీడాకారులందరూ పాల్గొని డ్యాన్సులతో ఆకట్టుకున్నారు. ఫైర్ క్యాంపును సత్య స్కానింగ్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ డాక్టర్ సి.స్టాలిన్, రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఆర్టోస్ అధినేత అడ్డూరి జగన్నాథవర్మ, తదితరులు క్యాంపు ఫైర్‌ను వెలిగించి ప్రారంభించారు. అనంతరం క్రీడా సంబరాల ఘనంగా నిర్వహించటంపై కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ పోటీల్లో ఆద్యంతం ఉత్కఠంగా జరిగిన మహిళల పోటీల్లో రామచంద్రపురం మహిళల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కాగా ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన క్రీడాకారులను సత్కరించారు. రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా శివల ప్రభల తీర్థం

కె.గంగవరం: మండలంలోని శివల గ్రామంలో కొలువుదీరిన పేరంటాలు పాపమ్మ అమ్మవారి ప్రభల తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కుడుపూరు, దంగేరు, సావరం తదితర పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రభలతో అమ్మవారి ఆలయం వద్ద సందడి వాతావరణం చోటు చేసుకుంది. సుమారు 300 ఏళ్లగా పూజలందుకుంటున్న పాపమ్మ అమ్మవారికి పూజలు చేసేందుకు దంగేరు గ్రామానికి చెందిన ప్రభ ఆనవాయితీగా ఆలయం వద్దకు చేరుకుంది. గ్రామానికి చెందిన ఓబులనేని వంశీయులు అమ్మవారికి ఏటా తీర్థం ఏర్పాట్లు చేస్తుంటారు. పాపమ్మ అమ్మవారికి ఇక్కడి నుంచే అన్ని రకాలుగా పూజలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా అమ్మవారికి తొమ్మిది రకాల వంటకాలు నైవేద్యంగా సమర్పించారు. బోణం వేసి మూడు రోజుల పాటు సంక్రాంతి సందర్భంగా పలు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగ మూడు రోజులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సంక్రాంతి సందర్భంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఈ ప్రభల తీర్థానికి తరలివచ్చి ప్రభలను తిలకిస్తూ ఆనందపరవశులయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



పాపమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుంటున్న కుడుపూరు ప్రభ

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పిల్లావారి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

రామచంద్రపురం: పట్టణంలోని పిల్లావారి వీధిలోని రాజీవ్‌గాంధీ పురపాలక సంఘం ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్ విద్యార్థులు 23 ఏళ్ల తర్వాత సోమవారం సమావేశమయ్యారు. పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారంతా పూర్వపు పాఠశాలలో సమావేశమై ముచ్చటించుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబ సభ్యులను పూర్వపు సహ విద్యార్థులకు పరిచయం చేసుకుంటూ సందడి చేశారు. నాటి గురువులను పూర్ణకుంభంతో స్వాగతం పలికి పాదాభినందనలు చేసుకుని ఘనంగా సత్కరించారు. వారి వృత్తుల్లో స్థిరపడిన సంగతులను చెప్పుకున్నారు. బ్యాచ్ పూర్వ విద్యార్థి జి.రామ్‌ప్రసాద్ తదితరులు పూర్వ విద్యార్థుల సమ్మేళన సంగతులను తెలిపారు.

కత్తులు దూసుకున్న కోళ్లు



రాయవరంలో నిర్వహించిన కోడి పందేల్లో తలపడుతున్న కోడిపుంజులు

రాయవరం: సంక్రాంతి మూడో రోజైన కనుమ నాడు కూడా రాయవరం, కూర్మాపురం గ్రామాల్లో కోడి పందేల జోరు కొనసాగింది. సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయం పేరుతో గ్రామంలో నిర్వహించిన కోడిపందేలకు వివిధ గ్రామాల ప్రజలు భారీగా తరలి వచ్చారు. పలువురు కోళ్లకు కత్తులు కట్టి పోటీకి బరిలో దించారు. పందాల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. భోగి రోజు ఉదయం ప్రారంభమైన కోడి పందేలు మంగళవారం వరకూ నిర్వహించారు. ఒక్కొక్క పందెం రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకూ పోటాపోటీగా సాగాయి.

కోడిపందేల నిర్వాహకులపై కేసులు

కోడి పందేలు ఆడుతున్నట్టు సమాచారం రావడంతో మండలంలోని రాయవరం, కూర్మాపురం గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో దాడులు చేశామని రాయవరం ఎస్సై జి.నరేష్ విలేకరులకు తెలిపారు.ఈ దాడుల్లో ఎనిమిదిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఎనిమిది కోడి పుంజులు, కత్తులు, రూ.5,670 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సంతోషిమాతకు వెండి కిరీటం సమర్పణ

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో వేంచేసిన సంతోషిమాత అమ్మవారికి అదే గ్రామానికి చెందిన బండారు నరసింహమూర్తి (కేబుల్ నెట్‌వర్క్ అబ్బులు) వెండి కిరీటం సమర్పించారు. సుమారు రూ.40 వేలతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని మంగళవారం అబ్బులు దంపతులు, ఆయన కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించగా అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించి, కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యుడు బండారు లక్ష్మణ్ తదితరులు అబ్బులు దంపతులను వేదాశీర్వచనం నడుమ ఘనంగా సత్కరించారు.

వైభవంగా మకర జ్యోతి దర్శనం

అలమూరు: అయ్యప్ప స్వామి శరణఘోషతో ఆలమూరు మార్మోగింది. శబరిమల తరహాలో అయ్యప్ప స్వామి మకరజ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చాడు. నాగులచెరువులో స్వామికి నిర్వహించిన తెప్పోత్సవం భక్తులను అలరించింది. మిరుమిట్లు గొలిపే విద్యుదీకరణతో ఆ ప్రాంతమంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఆలమూరులో అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మకరజ్యోతి దర్శనం, తెప్పోత్సవం వైభవంగా జరిగాయి. అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. అలాగే స్థానిక నాగులచెరువులో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి వారి తెప్పోత్సవంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితుల వేద మంత్రోచ్చారణల నడుమ అయ్యప్పస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మకర జ్యోతి దర్శనాన్ని తిలకించారు.

ఘనంగా తెప్పోత్సవం

మకరజ్యోతి దర్శనాన్ని పురస్కరించుకుని నాగులచెరువులో ఏర్పాటు చేసిన తెప్పోత్సవంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు తదితరులు తెప్పోత్సవంలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఆలయ కమిటీ అధ్యక్షుడు వైట్ల సత్యనారాయణ, వంటిపల్లి పాపారావు, వంటిపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో జరిగిన అయ్యప్పస్వామి తెప్పోత్సవంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

కిటకిటలాడిన గౌతమీ తీరం



సందర్శకులతో కిక్కిరిసిన రాజీవ్ రివర్ బీచ్ ప్రాంతం



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

యానాం: పట్టణ పరిధిలోని గౌతమీగోదావరి రాజీవ్ రివర్ బీచ్ ప్రాంతం మంగళవారం సందర్శకులతో కిటకిటలాడింది. సంక్రాంతిని పురస్కరించుకుని ఆంధ్రాతో పాటు తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వేలాదిగా సందర్శకులు తరలిరావడంతో లెక్కకు మించిన వాహనాలతో ట్రాఫిక్ స్తంభించింది. స్థానిక శివమ్‌బాత్ వద్ద పలువురు ఉత్సాహంగా స్నానాలు ఆచరించారు. పుష్కరమాత విగ్రహం నుంచి జీసెస్ విగ్రహం వరకూ మార్గమంతా సందర్శకులతో కిక్కిరిసిపోయింది.

మరోవైపు బీచ్ వద్ద ఉన్న బోటు షికారుకు సైతం అధిక సంఖ్యలో పర్యాటకులు ఉత్సాహం చూపారు. అదేవిధంగా ఫెర్రీరోడ్డు సైతం సందర్శకులతో నిండిపోయింది. యానాం ట్రాఫిక్, సాధారణ పోలీసు విభాగాల ఆధ్వర్యంలో సిబ్బంది గత నాలుగు రోజులుగా ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

కొత్త అల్లుడికి జంబో విందు



కోరంగిలో కొత్త అల్లుడికి భారీ అరటి ఆకులో ఏర్పాటు చేసిన విందు భోజనం

తాళ్లరేవు: మండలంలోని కోరంగిలో కొత్త అల్లుడికి అత్తింటివారు ఏకంగా 99 రకాల వంటకాలతో జంబో విందును ఏర్పాటు చేశారు. గతేడాది గ్రామానికి చెందిన గాలి సత్యనారాయణ కుమార్తె గీతను అనంతపురానికి చెందిన యువకుడు క్రాంతికిచ్చి వివాహం జరిపించారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండగకు కొత్త అల్లుడు క్రాంతి కోరంగిలోని అత్తవారింటికి వచ్చాడు. సత్యనారాయణ కుటుంబ సభ్యులు సంక్రాంతి సంబరాల పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి కొత్త అల్లుడికి ఘన స్వాగతం పలికారు. సంక్రాంతి సందర్భంగా మధ్యాహ్నం భారీ అరటి ఆకు వేసి విందు పెట్టారు. గారెలు, బూరెలు, అరెసెలు, జంతికలు, సున్నుండలు వంటి పిండి వంటలతో పాటు చికెన్, మటన్, చేపలతో వివిధ రకాల కూరలు చేసి మొత్తంగా 99 రకాల వంటకాలతో విందును ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. భారీ స్థాయిలో ఏర్పాటుచేసిన విందును చూసి కొత్త అల్లుడు అవాక్కయ్యాడు. అన్నిరకాలు తినాల్సిందేనని బంధువులు ఆట పట్టించడంతో ఒక్కొక్కటి రుచి చూడడం కొత్త అల్లుడి వంతైంది.